క్లుప్తంగా

మంత్రికి వినతి



మహబూబాబాద్: రేషన్ డీలర్లకు కనీస వేతనం రూ.30వేలు ఇవ్వాలని సంఘం జిల్లా అధ్యక్షుడు కుంభం యాదగిరి, ప్రధాన కార్యదర్శి బి.వెంకటనారాయణ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో మంత్రి సత్యవతికి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాంచందర్, కరుణాకర్‌రెడ్డి, శ్రీను, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుల వినతి

మానుకోట పట్టణంలో పని చేసే హోంగార్డులు తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కలెక్టరేట్‌లో మంత్రికి వినతిపత్రం అందజేశారు. జంపన్న, గౌస్, తదితరులు తెలిపారు.

కులవృత్తులపై ప్రత్యేక దృష్టి



మహబూబాబాద్: సీఎం కేసీఆర్ అన్నివర్గాలకు న్యాయం చేయడంతోపాటు కులవృత్తిదారులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టారని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. 19వార్డు పరిధిలో కురవి రోడ్డులో రూ.2కోట్లతో నిర్మాణం చేయనున్న మోడ్రన్ ధోబీ ఘాట్ పనులకు బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, కమిషనర్ ప్రసన్నరాణి, కౌన్సిలర్లు చిట్యాల జనార్దన్, బుజ్జి వెంకన్న, పద్మ, నాయకులు రవి, శంకర్ పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



మహబూబాబాద్ అర్బన్: క్రీడాకారులకు క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అథ్లెటిక్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాస నాగమణి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా నాగమణి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ విద్యారంగంతోపాటు క్రీడలకు సైతం పెద్దపీట వేస్తుందన్నారు. ఈనెల 7న హన్మకొండ జిల్లాలో జరుగు రాష్ట్ర స్థాయికి మానుకోట నుంచి 25మంది ఎంపికయ్యారన్నారు.

బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ



తొర్రూరు/మహబూబాబాద్ రూరల్: తొర్రూరు నూతన డీఎస్పీగా నియమితులైన జి.వెంకటేశ్వరబాబు బుధవారం డివిజన్ కేంద్రంలోని సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. డీఎస్పీ రఘు నూతన డీఎస్పీకి బాధ్యతలు అప్పగించారు. అనంతరం జిల్లా కేంద్రంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌లను డీఎస్పీ మర్యాద పూర్వకంగా కలిశారు.

అరెస్ట్‌పై నిరసన

కురవి: జాతీయ నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ మరిపెడ డివిజన్ కార్యదర్శి గంధసిరి జ్యోతిబసు డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన చలో రాజ్‌భవన్‌లో నాయకుల అరెస్టును నిరసిస్తూ బుధవారం మండల కేంద్రంలోని గుడిసెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వీరేందర్, మురళీ, వినయ్ పాల్గొన్నారు.

సామర్థ్యాల పెంపునకు 'తొలిమెట్టు'

గూడూరు: ప్రాథమిక స్థాయి 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులలో తెలుగు, గణితం, ఇంగ్లిషులో విద్యా సామర్థ్యాలు పెంపొందించాలని స్టేట్ రిసోర్స్‌పర్సన్‌లు చక్రవర్తులు, శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో బాలుర హైస్కూల్‌లో బుధవారం రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు తొలిమెట్టు శిక్షణను ఉపాధ్యాయులకు నిర్వహించారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ కె.హనుమంతరావు, కేంద్ర ఇన్‌చార్జ్ పాడెం కాంతారావు, చంద్రశేఖర్ ఆజాద్ పాల్గొన్నారు.

తొర్రూరు: అభ్యసన సామర్థ్యాల పెంపు కోసం విద్యాశాఖ తొలిమెట్టు శిక్షణకు శ్రీకారం చుట్టిందని ఎంఈఓ గుగులోతు రాము తెలిపారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొలిమెట్టు శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. నోడల్ అధికారి తుమ్మ వెంకటేశ్వర్లు, రిసోర్స్ పర్సన్లు కృష్ణమూర్తి, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నెల్లికుదురు: సత్ఫలితాల కోసమే ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న తొలిమెట్టు కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని నోడల్ ఆఫీసర్ ఆరుద్ర వెంకటేశ్వర్లు కోరారు. మండల కేంద్రంలో మండల స్థాయి తొలిమెట్టు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నోడల్ ఆఫీసర్ ప్రారంభించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి మిర్యాల సతీష్‌రెడ్డి, కందగట్ల రాకేష్, యాకేందర్, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

డోర్నకల్: స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో బుధవారం ఉపాధ్యాయులకు తెలుగు సబ్జెక్టుపై మండలస్థాయి శిక్షణ ఇచ్చారు. తెలుగు సబ్జెక్టుపై ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసీ శిక్షణ ఇచ్చారు. కోర్సు డైరెక్టర్‌గా నోడల్ హెడ్ మాస్టర్ ఆంగోత్ లక్ష్మా, ఆర్‌సీలుగా రాములు, రామయ్య, జిల్లా పరిశీలకులుగా విత్తనాల సుధాకర్, సారంగం వ్యవహరించారు.

గార్ల: విద్యార్థులకు తెలుగు, మ్యాథ్స్, ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లను సులభ పద్ధతిలో అర్థమయ్యేలా నేర్పించాలని ఎంఈఓ బి.పూల్‌చంద్ సూచించారు. బుధవారం మండలంలోని ముల్కనూరు హైస్కూల్లో తొలిమెట్టుపై ఉపాధ్యాయుల 6రోజులపాటు కొనసాగే శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ ఆర్.వెంకట్రామ్, అసిస్టెంట్ కోర్స్ డైరెక్టర్ ఎస్.సీతారామ్ రెడ్డి, హెచ్ఎం శివ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గూడూరు: శిక్షణలో మాట్లాడుతున్న కాంతారావు



గార్ల: శిక్షణ ఇస్తున్న ఎంఈఓ బి.పూల్‌చంద్



తొర్రూరు: మాట్లాడుతున్న ఎంఈఓ రాము



నెల్లికుదురు: తొలిమెట్టు కార్యక్రమంలో శిక్షణ ఇస్తున్న వెంకటేశ్వర్లు

విద్యార్థుల బంగారు భవితకు తొలిమెట్టు

కేసముద్రం: విద్యార్థుల బంగారు భవిత కోసమే తొలిమెట్టు కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని మండల నోడల్ హెచ్ఎం, కోర్స్ డైరెక్టర్ కొత్త జగన్మోహన్‌రెడ్డి, జిల్లా సీఎంఓ అజాద్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం కేసముద్రంవిలేజ్ జెడ్పీఎస్ఎస్‌లో పీఎస్ ఉపాధ్యాయులకు తొలిమెట్టు శిక్షణ తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పరిశీలకులు సదయ్య, లక్ష్మీనారాయణ, సోమ నర్సయ్యాచారి, భిక్షపతి, సరిత, నాగవాణి పాల్గొన్నారు.

మూడోసారి కూడా కేసీఆరే సీఎం

● ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

మరిపెడ రూరల్: ఈ ఏడాది డిసెంబర్‌లో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి కూడా సీఎం కేసీఆరేనని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. నియోజకవర్గంలోని దంతాలపల్లి మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామానికి చెందిన బీఎస్పీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు 200 మంది మహిళలు మరిపెడలోని ఎల్లంపేటలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారందరికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అనేక మంది వివిధ పార్టీల కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తలకు పార్టీ తప్పక గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర్‌రెడ్డి, దంతాలపల్లి మండల రైతు సమితి అధ్యక్షుడు ఓలాద్రి మల్లారెడ్డి, మండల అధ్యక్షుడు ధర్మారపు వేణు, యూత్ నాయకులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన మహిళా కార్యకర్తలు

ఎమ్మెల్యేకు వినతి

జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు ఆర్థికంగా నష్టపోయిన మత్స్యకారుల కుటుంబాలను ఆదుకోవాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి గొడుగు శ్రీనివాస్ అన్నారు. ఈమేరకు బుధవారం మండలంలోని ఎల్లంపేటలో ఎమ్మెల్యే రెడ్యానాయక్‌ను ముదిరాజ్ మహాసభ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

పుట్టిన బిడ్డకు తల్లిపాలే అమృతం



నెల్లికుదురు: అవగాహన కల్పిస్తున్న సూపర్ వైజర్ ఉషారాణి



కేసముద్రం: మాత్యతండాలో..

మరిపెడ రూరల్: తల్లిపాలే పుట్టిన బిడ్డకు అమృతం లాంటివని వాటి విలువను ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలని ఎల్లంపేట సూపర్‌వైజర్ శ్రీలత అన్నారు. బుధవారం ఎల్లంపేట సెక్టార్‌లోని అంగన్‌వాడీ కేంద్రం-3లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు విజయకుమారి, లింగోజు శ్రీలత పాల్గొన్నారు. మండలంలోని అబ్బాయిపాలెం సెక్టార్‌లోని తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయలక్ష్మి, సర్పంచ్ జినక మణిఇద్దయ్య పాల్గొన్నారు.

గూడూరు: గర్భిణిలు, బాలింతలు తల్లి ముర్రుపాల ప్రాముఖ్యతను గుర్తించి అందించాలని సీడీపీఓ నీలోఫర్ అజ్మీ అన్నారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో బుధవారం తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ఇంటింటికీ వెళ్లి బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో టీచర్ భారతి, సూజర్‌వైజర్లు పాల్గొన్నారు.

కేసముద్రం: మండలంలోని క్యాంపుతండాజీపీ శివారు మాత్యతండా అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అమ్మి, అంగన్‌వాడీ టీచర్ తిరుణగిరి వాణి, కార్యదర్శి వినయ్, అంగన్‌వాడీ టీచర్ స్వప్న, నీల, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నెల్లికుదురు: మండలంలోని శ్రీరామగిరి గ్రామంతోపాటు వివిధ గ్రామాలల్లో మురిపాల వారోత్సవాలు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం తల్లిపాల గురుంచి అవగాహన కల్పించినట్లు సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కనకతార, సుజాత, ఇందిరా పాల్గొన్నారు.

చిన్నగూడూరు: మండలంలోని మేగ్యాతండా గ్రామ పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జ్యోతి, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారంపై పట్టింపు లేదా!

● నాయకుడు మురళీనాయక్

గూడూరు: భారీ వర్షాలతో ప్రజలు, రైతులు ఎంతో నష్టపోయి ఇబ్బందులు పడుతుంటే, ఎమ్మెల్యే, మంత్రివర్యులకు ప్రజా సమస్యల పరిష్కారంపై కనీసం పట్టింపు లేదా అని కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ మురళీనాయక్ అన్నారు. మండలంలోని గుండెంగ, మధనాపురం, బొల్లెపల్లి, గుండెంగ గ్రామాలలో బుధవారం ఆయన ఇటీవల భారీ వర్షానికి నష్టపోయిన వారి గడగడపకు వెళ్లి సమస్యలు అడిగి తెల్సుకున్నారు. అనంతరం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో కనీసం గడచిన 5 ఏళ్లలో ఎమ్మెల్యే, మంత్రి, ప్రభుత్వం చెప్పిన పథకాలు ఒక్కటి కూడా రాలేదన్నారు. ఎమ్మెల్యే శంకర్‌నాయక్ వేసవికాలంలో మట్టివాడ శివారు దొరవారితిమ్మాపురం గ్రామాన్ని సందర్శించి, అక్కడున్న ఖనిజ సంపదపై కన్నేశారని, వెంటనే ఫారెస్టు అధికారులతో టైగర్ జోన్ పేరు చెప్పి గ్రామాన్ని తరలించే ప్రయత్నం ఫలించలేదని ఆరోపించారు. కానీ అదే గ్రామానికి ఫొటో ఫోజులకే ట్రాక్టర్‌పై వెళ్లి, అక్కడ భోజనం చేసి నేనున్నానని చెబితే వారు నమ్మరని హితవుపలికారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మాధవపెద్ది రమేష్‌చందర్‌రెడ్డి, మాధవపెద్ది ప్రదీప్‌రెడ్డి, ఎడ్ల నరేష్‌రెడ్డి, మానుకోట మండల పార్టీ అధ్యక్షుడు మిట్టకంటి రాంరెడ్డి, కేసముద్రం సింగిల్‌విండో చైర్మన్ అంబటి మహేందర్‌రెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మురళీనాయక్

గిరిజన రైతులకు వెంటనే పట్టాలు ఇవ్వాలి

గార్ల: మండలంలోని చిన్నబంజర, కట్టుకుంటతండాలో తాత ముత్తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న గిరిజనుల భూములకు పట్టాలు ఇవ్వాలని న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి జి.సక్రు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయం ఎదుట బాధిత రైతులతో కలిసి ఆయన మాట్లాడారు. పుల్లూరు రెవెన్యూ గ్రామ పరిధిలో 1200 ఎకరాల్లో సాగు చేసుకుంటున్న 1100 ఎకరాలకు పట్టాలు ఇచ్చారన్నారు. మిగతా 100 ఎకరాలకు నేటికీ పట్టాలు ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మనోహర్, వీరభద్రం, సక్రు, సర్వయ్య, పంచీరామ్, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి రూ.లక్ష సాయం



చెక్కు అందిస్తున్న సాంపంగి సోదరులు

డోర్నకల్: కష్టపడి చదివి ఉన్నత చదువును అభ్యసించిన ఓ పేద విద్యార్థినికి డోర్నకల్ మండలం ఉయ్యాలవాడకు చెందిన సాంపంగి రమేష్ సోదరులు లక్ష రూపాయల ఆర్థికసాయం అందించారు. అనంతపురం జిల్లా శింగనమల మండలం నాగులగడ్డం గ్రామానికి చెందిన సాకే భారతి శ్రీకృష్ణదేవరాయ యునివర్సిటీ నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా పొందింది. పేద కుటుంబానికి చెందిన భారతి కష్టపడి చదివి గుర్తింపు పొందిన విషయం తెలుసుకున్న సాంపంగి రమేష్ సోదరులు నాగులగడ్డం గ్రామానికి వెళ్లి భారతికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించడంతో పాటు తల్లిదండ్రులకు దుస్తులు బహూకరించారు. కార్యక్రమంలో సాంపంగి సురేష్, నరేందర్, శ్రీనివాస్, భానుగౌడ్ పాల్గొన్నారు.

కనీస వేతన చట్టం అమలు చేయాలి

మహబూబాబాద్ రూరల్: వ్యవసాయ కార్మికులకు కనీస వేతన చట్టాన్ని ప్రభుత్వ అధికారులు పటిష్టంగా అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య డిమాండ్ చేశారు. మండలంలోని అయోధ్య గ్రామంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో రెక్కల కష్టం మీద ఆధారపడిన వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. 57 ఏళ్ల పైబడిన వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.5వేల పెన్షన్, కూలి బంధు, కూలి బీమా సౌకర్యం కల్పించాలన్నారు. మండల కార్యదర్శి గణేష్, కార్మికు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి భగీరథ నీరు అందించాలి

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని 36వార్డుల్లో ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ మంచి నీరు అందించాలని మున్సిపల్ చైర్మన్ రామోహన్‌రెడ్డి, కమిషనర్ ప్రసన్న రాణి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గోపాలపురం కాలనీలో మిషన్ భగీరథ పంప్ హౌజ్‌ను వారు పరిశీలించారు. ప్రజలకు మంచినీటి సమస్య తలెత్తకుండా ఉండాలని ఎక్కడ నీటి సమస్య ఉన్నట్లతే వాటర్ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ సురేష్, విద్యుత్‌శాఖ ఏఈ సంగీత, మిషన్ భగీరథ ఎస్‌సీసీ రమణరావు, తదితరులు పాల్గొన్నారు

సంక్షిప్త సమాచారం

జయప్రదం చేయాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ ఈనెల 4న జరగనున్న విద్యార్థి గర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కేలోతు సాయి కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణాన్ని బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి గుగులోతు సూర్య ప్రకాష్, జిల్లా సహాయ కార్యదర్శి సింహాద్రి, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

కురవి: మండలంలోని నేరడ గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్లు కూలిపోయాయి. ఈమేరకు బాధితులైన కొత్తవెంకన్న, ప్రేమ్‌పాల్‌లకు బుధవారం మహబూబాబాద్ భగత్‌సింగ్ సర్కిల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. సర్పంచ్ శ్రీనివాస్, ఉపసర్పంచ్ హేమంత్ పాల్గొన్నారు.

నెల్లికుదురు: మండలంలోని రామన్నగూడెంలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న నిరుపేద కుటుంబమైన పల్లె వీరయ్య కూతురు వివాహానికి మాజీ సర్పంచ్ కాసం విజయ బుధవారం రూ.15వేలు ఆర్థికసాయం అందించారు.

సన్మానం

గార్ల: గార్ల మేజర్ గ్రామ పంచాయతీలో 61 సంవత్సరాలు స్వీపర్‌గా విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన వల్లభుదాసు నాగమ్మను బుధవారం సర్పంచ్ అజ్మీర బన్సీలాల్, సిబ్బందితో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహేశ్వరరావు, ఎంపీఓ రజిని, సూపరింటెండెంట్ ఉదయశ్రీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

బయ్యారం: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం ఎంఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం ఎంఈఓ పూల్‌చంద్‌కు వినతిపత్రంను అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి బానోత్ దేవేందర్, నాయకులు గణేష్, అబ్దుల్‌కలాం, రేవంత్, కృష్ణ, కళ్యాణ పాల్గొన్నారు.

రహదారితో తీరనున్న రైతుల కష్టాలు

మరిపెడ రూరల్: రెండు గ్రామాల మధ్య రహదారి నిర్మాణంలో ఆయా గ్రామాల రైతుల కష్టాలు తీరనున్నాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మరిపెడ మండలం తాళ్ల ఊకల్ నుంచి వెంకంపాడు నిర్మిస్తున్న రహదారి విస్తరణ పనులకు ఆయన బుధవారం పరిశీలించారు. నిధులు మంజూరు చేయించిన మంత్రి సత్యవతి రాథోడ్‌కు శ్రీనివాస్‌రెడ్డి రైతుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సమాన పనికి సమాన వేతనమివ్వాలి

తొర్రూరు: కార్మికులకు సమాన పనికి సమాన వేతనాలివ్వాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. ఈనెల 4న హైదరాబాద్‌లో జరిగే కార్మిక గర్జన పోస్టర్లను ఐఎఫ్‌టీయూ నాయకులు బుధవారం డివిజన్ కేంద్రంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు బీకు, ఎస్కే పాషా, వెంకన్న, సాయిలు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని పెంపొందించేందుకే గ్రంథాలయాలు

మహబూబాబాద్: విజ్ఞానాన్ని పెంపొందించేందుకే గ్రంథాలయాలు అని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని వార్డు కౌన్సిలర్ హరిసింగ్ నాయక్ అన్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురంలో పాత జీపీ భవనంలో గ్రంథాలయం ఏర్పాటుకు జనరల్ ఫండ్ నుంచి రూ.6లక్షలు కేటాయించగా ఆ నిధుల నుంచి మరమ్మతుల పనులను హరిసింగ్ నాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో మల్లయ్య, ఉపేంద్రమ్మ, కుమారస్వామి, రవీందర్‌రెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

వైకల్య నివారణ మెటీరియల్ పంపిణీ

నెల్లికుదురు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బోధకాలు వ్యాధిగ్రస్తులకు వైకల్యం నివారణ మెటీరియల్‌ను సర్పంచ్ బీరవెల్లి యాదగిరిరెడ్డితో కలిసి అందించినట్లు మండల వైద్యాధికారి వంశీకృష్ణ తెలిపారు.

పోస్టాఫీస్‌లో ఆధార్ కేంద్రం ఏర్పాటు

డోర్నకల్: డోర్నకల్ పోస్టాఫీస్‌లో ప్రత్యేక అధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తపాలా శాఖ ఏఎస్‌పీ ఎల్.సైదానాయక్ తెలిపారు. స్థానిక పోస్టాఫీస్‌లో బుధవారం ఆధార్ కేంద్రం ఏర్పాటుకు సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లను విడుదల చేసిన సైదానాయక్ మాట్లాడారు. కార్యక్రమంలో సబ్ పోస్ట్‌మాస్టర్ శ్రీనివాస్, పీఏ బన్సిలాల్, సిబ్బంది నర్సింహరావు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలి

గార్ల: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో గ్రామాల్లో దోమల ఉధృతి పెరిగినందున, గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలని ఎంపీడీఓ జి.వీరందర్ పంచాయతీల కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం ఆయన మాట్లాడారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ

కొత్తగూడ: మణిపూర్‌లో శాంతి నెలకొనాలని ఆకాంక్షిస్తూ క్రైస్తవులు మండల కేంద్రంలో బుధవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా బిషప్ పల్లెపాక తిమోతి మాట్లాడుతూ.. కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

చెరువు కట్టపై గండి పూడ్చివేత

తొర్రూరు: ఇటీవల కురిసిన వర్షాలతో పట్టణంలోని పెద్ద చెరువు కట్టకు గండి పడగా నీటిపారుదల శాఖ అధికారులు పూడ్చివేతకు చర్యలు చేపట్టారు. చెరువు కట్టకు గండి పడగా పూడ్చివేతకు ఇటీవల మున్సిపాలిటీ పాలకవర్గం రూ.లక్ష నిధులు కేటాయిస్తూ తీర్మానం చేసింది. ఇసుక బస్తాలు వేసి గండిని పూడ్చివేశారు. ఐబీ ఏఈ శ్రీనివాస్, నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

బస్‌పాస్‌ల పంపిణీ

డోర్నకల్: స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో బుధవారం విద్యార్థులకు ఎంఈఓ పూల్‌చంద్ ఉచిత ఆర్టీసీ బస్‌పాస్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు మాణిక్యం, లక్ష్మా, ఆర్టీసీ విలేజ్ అధికారి రవి, పీఈటీ శ్యాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

మరిపెడ రూరల్: మండల పరిధిలోని సోమ్లతండాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు గుగులోతు సూర్య ఇటీవల మృతి చెందాడు. బుధవారం పార్టీ సభ్యత్వ భీమా చెక్కు రూ.2లక్షలు బాధిత కుటుంబానికి ఎంపీపీ గుగులోతు అరుణ అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకన్న, సర్పంచ్ బిక్కునాయక్ పాల్గొన్నారు.

అవకతవకలపై విచారణ జరపాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటులో జరిగిన అవకతవకలు సవరించి, అక్రమ డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేయాలని టీయస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్ అన్నారు. బుధవారం డీఈఓ రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా షేక్ యాకూబ్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో మిగులుగా ఉన్న ఉపాధ్యాయులను కొరత ఉన్న పాఠశాలల్లో సర్దుబాటు చేయడంలో అనేక అక్రమాలు జరిగాయని, వాటిని వెంటనే పునఃపరిశీలన చేసి సవరించాలన్నారు. డోర్నకల్ మండలంలో ఎంపీయూపీఎస్ ఉయ్యాలవాడ నుంచి హిందీ పండిట్‌ను జెడ్పీహెచ్ఎస్ చిలుకోడ్‌కు కేటాయించే మండలం దాటించి కురవి మండలంలోని జెడ్పీహెచ్ఎస్ మోదుగులగూడేనికి పంపడం జరిగిందన్నారు. తక్షణమే అవకతవకలపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ, హరినాయక్, వెంకట్, కుమార్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి



శ్రీకన్య (ఫైల్)

మరిపెడ రూరల్: మండలంలోని నీలికుర్తి గ్రామానికి చెందిన పాక బిక్షం, ఈశ్వరమ్మల కుమార్తె పాక శ్రీకన్య (30) వీరి కుటుంబ కొంత కాలంగా ఖమ్మంలో ఉంటున్నారు. శ్రీకన్య ఇండియన్ గ్యాస్ ఏజెన్సీలో ప్రైవేట్ వర్కర్‌గా పనిచేస్తుంది. ఈక్రమంలో ద్విచక్రవాహనంపై మరో మహిళ నూనావత్ రాణితో కలిసి విధులు భాగంగా వైరా వెళ్తున్నారు. ఖమ్మం బైపాస్ రోడ్డులోని వీవీసీ సర్కిల్ వద్ద వీరి ద్విచక్రవాహనాన్ని లారీ బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో శ్రీకన్య అక్కడికక్కడే మృతి చెందగా, బైక్‌పై ఉన్న మరో మహిళలు తీవ్రగాయాలయ్యాయి.

మరిపెడలో ఒకరు..

మరిపెడ: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరికి గాయాలైన సంఘటన మరిపెడ శివారు విద్య వెర్బల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ దగ్గర చోటుచేసుకుంది. ఎస్సై దూలం పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అబ్బాయిపాలెం గ్రామానికి చెందిన కందుకూరి లక్ష్మణ్(21) అనేపురం గ్రామానికి చెందిన పులగుజ్జు ఈశ్వర్‌లు కలిసి ద్విచక్రవాహనంపై మంగళవారం రాత్రి అనేపురంలో వారి స్నేహితుడి బర్త్‌డే పార్టీకి వెళ్లి తిరిగి వస్తున్నారు. ద్విచక్రవాహనం అదుపు తప్పి చెట్టుకు ఢీకొనడంతో లక్ష్మణ్‌కు తీవ్రగాయాలు కాగా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. ఈశ్వర్‌కు స్వల్ప గాయాలయ్యాయని ఎస్సై తెలిపారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కురవిలో ఒకరు..

కురవి: రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు కురవి ఎస్సై గోపి బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కురవి మండలం మోద్గులగూడెం శివారు జుజ్జూర్ తండాకు చెందిన భూక్య బిచ్చు(48) అనే వ్యక్తి కురవి నుంచి మోద్గులగూడేనికి ద్విచక్రవాహనంపై మంగళవారం రాత్రి వెళ్తున్నాడు. బైక్ అదుపు తప్పి కురవి శివారులో జాతీయ రహదారిపై పడిపోయాడు. ఖమ్మం తరలిస్తుండగా చనిపోయినట్లు తెలిపారు. బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నాడు.

వ్యక్తి ఆత్మహత్య

డోర్నకల్: మండలంలోని హూన్యాతండాలో ఓ వ్యక్తి అనారోగ్య సమస్యలతో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. డోర్నకల్ ఏఎస్సై కోటేశ్వర్‌రావు బుదవారం తెలిపిన వివరాల ప్రకారం.. హూన్యాతండాకు చెందిన గుగులోత్ భద్రు(50) అనారోగ్య సమస్యలతో మంగళవారం పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు మహబూబాబాద్‌లోని ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కేసముద్రం: కుటుంబ కలహాల కారణంగా ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని బోడమంచ్యాతండా జీపీలో చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన బోడ బాలు(43) బుల్లి దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈక్రమంలో బాలు ఇంట్లో దాచిన డబ్బులను తీసుకుని మద్యం సేవిస్తుండటంతో, మంగళవారం అతన్ని భార్య మందలించింది. దీంతో మనస్తాపం చెందిన అతడు పురుగులమందు తాగడంతో, చికిత్స నిమిత్తం మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు హుస్సేన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నల్లబెల్లం పట్టివేత

నర్సింహులపేట: మండలంలోని పెద్దనాగారం శివారులో అక్రమంగా కారులో తరలిస్తున్న 3.5 క్వింటాళ్ల నల్లబెల్లం, అర క్వింటా పటిక, 20 లీటర్ల గుడుంబాను బుధవారం పట్టుకొని సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ భాస్కర్‌రావు తెలిపారు. పెద్దనాగారానికి చెందిన పవన్‌పై కేసు నమోదు చేసి, కారు సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

కవాడిగూడ 'సాక్షి' రిపోర్టర్ కన్నుమూత



వీరన్న (ఫైల్)

బయ్యారం: హైదరాబాద్ నగరంలోని కవాడిగూడ 'సాక్షి' రిపోర్టర్‌గా పనిచేస్తున్న మద్దినేని వీరన్న(49) మంగళవారం రాత్రి చనిపోయాడు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విద్యార్థి దశలో పీడీఎస్‌యూ నాయకుడిగా రాష్ట్ర స్థాయిలో పనిచేసి గుర్తింపు తెచ్చుకున్నారు. వీరన్న మృతదేహంను ఇల్లందు ఎమ్మెల్యే హరిప్రియ, మహబూబాబాద్, భద్రాద్రి జెడ్పీ చైర్మన్లు బిందు, కనకయ్య, మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గణేష్, సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి, సర్పంచులు కోటమ్మ, రమేష్, వెంకటేశ్వర్లు, వెంకటరమణ, ఎంపీటీసీ సోమేష్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు బాబా, నాయకులు భిక్షం, ఐలయ్య, ఐలయ్య, వెంకటేశ్వర్లు, నర్సయ్య, విజయ్‌సారథి, జర్నలిస్టు సంఘాల నాయకులు శ్రీనివాస్, భిక్షం, సురేష్, తదితరులు సందర్శించి నివాళులర్పించారు.